ఘనంగా దత్తాత్రేయ జయంతి



బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ శ్రీ విజయ గణపతి ఆలయంలో ఆదివారం దత్తాత్రేయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయుని అభిషేకం , హోమం, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయ కమిటీ ఎన్నిక



ఆలయ కమిటీ చైర్మన్ శంకర్‌ను సన్మానిస్తున్న సభ్యులు

అత్తాపూర్: హైదర్‌గూడ నల్లపోచమ్మ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ అమ్రం అశోక్ అధ్యక్షతన ఆదివారం దేవాలయంలో సమావేశం ఏర్పాటు చేసి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా పొట్ట శంకర్, అధ్యక్షుడిగా బర్ల జంగయ్య, కోశాధికారిగా పొతిగంటి మహేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ రెండేళ్ల పాటు కొనసాగుతుందని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అమ్రం దశరథ్, జవాజ యాదగిరి, రెబ్బ సదానంద్, అమ్రం సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత



అయ్యప్ప స్వాములను సన్మానిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: దైవచింతనతో మానసిక ప్రశాంతత ఉంటుందని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నవంబర్ 6న మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ నుంచి పాదయాత్రగా శబరికి వెళ్లి అయ్యప్ప స్వామిని దర్శించుకున్న దీక్షాపరులు తిరిగి నగరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా స్వాములు నర్సిరెడ్డి గురుస్వామి, రమేశ్‌రెడ్డి గురుస్వామి, కొండల్‌ముదిరాజ్ గురుస్వామి, సురేందర్ గురుస్వామి, కిశోర్ గురుస్వామి, వేణుగోపాల్ స్వామి, నాగరాజు స్వామి తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు సన్మానం



శేఖర్‌బాబు యాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

బండ్లగూడ: నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎన్నికైన శేఖర్ బాబు యాదవ్‌ను పలువురు నాయకులు ఆదివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శేఖర్ బాబు యాదవ్ మాట్లాడుతూ నార్సింగి మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేడిపల్లి యాదయ్య, మల్లేశ్, శ్రీశైలం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళి



హైదర్‌గూడ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాబాదా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక సర్దార్ వల్లభాయ్ పటేల్ చౌరస్తాలో వల్లభాయ్ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారాగూడెం మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సర్దార్ వల్లభాయ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మొండ్ర కొముర‌య్య, అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మొండ్ర సంగీతాగౌరీశంకర్, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి సుల్గె వెంకటేశ్, నల్లింగ్ రమేశ్, రాచూరి రాజశేఖర్, నల్లుట్ల జగన్, సుధాకర్‌రెడ్డి, కీర్తి, శ్రీనివాస్, మ్యాడం రాము, విశాల్, కైలా రవీందర్‌రెడ్డి, సులిగే మల్లేశ్, అత్తాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి రావుల జగన్, గౌరిగే రాజు పైల్వాన్, వరదరాజు, కృష్ణారెడ్డి, శ్రీకాంత్‌చారి, బాలకృష్ణ, బర్ల మల్లారెడ్డి, కాడెం నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్ రవి కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగుతుందని రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్లకు చెందిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

విజేత ఆషాన్ సీసీ జట్టు

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని ఆలె నరేంద్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్ (మిత్రా క్లబ్ ప్లే గ్రౌండ్)లో ఆదివారం నిర్వహించిన దుర్గా సింగ్ ఠాకూర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ కప్‌ను ఆషాన్ సీసీ జట్టు గెలుచుకుంది. ఈ టోర్నమెంట్‌లో 16 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో ఆషాన్ సీసీ జట్టు, రాజీవ్ గాంధీ సీసీ జట్లు తలపడగా ఆషాన్ సీసీ జట్టు విజేతగా నిలిచింది. ముఖ్యఅతిథిగా హాజరైన గౌలిపురా మాజీ కార్పొరేటర్ ఆలె జితేంద్ర విజేత ఆషాన్ సీసీ జట్టుకు కప్‌తో పాటు రూ.8,888 క్యాష్ ప్రైజ్, మెడల్స్‌ను అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన రాజీవ్‌గాంధీ సీసీ జట్టుకు రూ.4,444 క్యాష్ ప్రైజ్, ట్రోఫీ, మెడల్లను అందజేశారు. కార్యక్రమంలో క్రికెట్ నిర్వాహకులు గోకుల్, కే అజయ్, శ్రీకాంత్ స్వామి, కపిల్ కుపిందర్, బీజేపీ నాయకులు జమాల్‌పూర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



విశాలంగా ఉన్న మినీస్టేడియం

క్రీడల్..!

అలంకారప్రాయంగా మినీ స్టేడియం

- వసతులున్నా క్రీడల నిర్వహణకు నోచుకోని వైనం
- వృథాగా భవనం
- పట్టని అధికారులు



వృథాగా మారిన మినీస్టేడియం భవనం

శంషాబాద్: యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు 2009లో అప్పటి ప్రభుత్వం రూ. 50 లక్షల నిధులతో నిర్మించిన మినీ స్టేడియం అలంకారప్రాయంగా మారింది. అన్ని వసతులు ఉన్నా.. క్రీడల నిర్వహణకు నోచుకోకపోవడంతో అధ్వానంగా మారింది. అయినా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జూదరులకు అడ్డాగా భవనం

యువజన క్రీడా సర్వీసుల శాఖ ఆధ్వర్యంలోని మినీస్టేడియం భవనం ప్రస్తుతం వృథాగా ఉంటోంది. అప్పట్లో కొంతకాలం ప్రభుత్వాసుపత్రి కోసం, మరికొంత కాలం గ్రంథాలయం కోసం భవనాన్ని వినియోగించారు. అయితే గత ఏడాదిన్నరగా భవనం వినియోగంలో లేకుండాపోవడంతో ప్రస్తుతం ఈ ప్రాంగణం జూదరులకు అడ్డాగా మారుతోంది.

విశాల మైదానం ఉన్నా..

స్టేడియం చుట్టుపక్కల కూర్చుని వీక్షించేలా ఏర్పాట్లు ఉన్నాయి. విశాలమైన మైదానంతో పాటు వాలీబాల్ కోర్టు తదితర ఏర్పాట్లు సైతం ఉన్నాయి. ఇటీవల నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీలకు సైతం ఈ మైదానం ఎంతో అనుకూలంగా ఉన్నప్పటికీ ప్రభుత్వాధికారులు మాత్రం ప్రైవేట్ విద్యాసంస్థలోనే క్రీడా పోటీలు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. మైదానంలో మరిన్ని వసతులు ఏర్పాటు చేసి ప్రభుత్వ క్రీడలకు మినీస్టేడియాన్ని ఎందుకు వినియోగించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వృథాగా ఉండడంతోనే మినీస్టేడియం పోకిరీలు, జూదరులకు అడ్డాగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్రీడాపోటీలు ఇక్కడే నిర్వహించాలి..



ప్రభుత్వ ఆధ్వర్యంలోని క్రీడాపోటీలను కూడా ప్రైవేట్ విద్యాసంస్థలో నిర్వహించి ఎవరికీ మేలు చేయాలనే ప్రయత్నం చేస్తున్నారో అర్థం కావడం లేదు. స్థానిక సంస్థలు, క్రీడా శాఖ దీనిపై దృష్టిసారించి మినీస్టేడియంలోనే క్రీడాపోటీలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి. అలాగే మైదానంలో ఉన్న భవనాన్ని కూడా వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలి.

–అక్రంఖాన్, శంషాబాద్

'ఫెడరేషన్'లో రాజకీయాలకు తావివ్వొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు

–ఆల్ కాలనీస్ ఫెడరేషన్ తీర్మానం

మణికొండ: 'ఆల్ కాలనీస్ ఫెడరేషన్'లో రాజకీయాలకు తావులేదని సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ మేరకు మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఫెడరేషన్ ఆఫ్ ఆల్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్స్ అధ్యక్షుడు డాక్టర్ పి.అవినాశ్ అధ్యక్షతన ఆదివారం రెండో ప్రత్యేక జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గత సమావేశంలో చర్చకు వచ్చిన రాజకీయ పార్టీల్లో పనిచేసే నాయకులు, కండువాలు వేసుకుని తిరిగే వారు, రాజకీయ పార్టీలకు మద్దతుగా నిలిచేవారికి ఫెడరేషన్ కార్యవర్గంలో స్థానం ఇవ్వొద్దనే విషయమై మరోసారి సభ్యుల అభిప్రాయం అడిగి తెలుసుకున్నారు. దాంతో వారంతా ముక్త కంఠంతో ఫెడరేషన్ కాలనీల సమస్యల పరిష్కారానికి తమవంతుగా కృషి చేసే వేదిక అని స్పష్టం చేశారు. కాలనీ సంక్షేమ సంఘాల వారితో పరిష్కారం కానివి, సామూహిక సమస్యలను ఫెడరేషన్ వారు తీసుకుని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ తీసుకోవాలని తప్ప పార్టీల కండువాలను వేసుకుని ప్రజల్లో తిరగవద్దని సూచించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీ ఆంజనేయులు, కోశాధికారి ఆర్. బాబురావు, కార్యవర్గసభ్యులు, పలు కాలనీల సంక్షేమ సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గొల్ల కలాపం



ప్రదర్శనలోని ఓ సన్నివేశం

నాంపల్లి: భాగవతుల రామయ్య రచించిన ఆత్మయజ్ఞం అనే గొల్ల కలాపాన్ని నృత్యకారులు డాక్టర్ పి.రమాదేవి, ఎన్ఆర్ఐ మనస్విని అవ్వారి అద్భుతంగా నర్తించి ఆహుతులను ఆకట్టుకున్నారు. ఆదివారం రాత్రి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో గొల్ల కలాపం నృత్య ప్రదర్శనను ప్రదర్శించారు. 18వ శతాబ్దంలో భాగవతుల రామయ్య ఆత్మయజ్ఞం అనే గొల్ల కలాపాన్ని రచించారు. కాలక్రమేణ ఈ ప్రదర్శనను వెంపటి వెంకట నారాయణ, భాగవతుల విస్సయ్య, వేదాంతం పార్వతీశం వంటి వారెందరో భాగవతుల గొల్ల కలాపం వేషాన్ని చిత్రీకరించినా పూర్తి స్థాయిలో ప్రదర్శించబడలేదు. కానీ ప్రొఫెసర్ భాగవతుల సేతురామ్ 2004లో భాగవతుల రామయ్య రచించిన ఆత్మయజ్ఞం ఆధారంగా పూర్తి నిడివి కలిగిన గొల్ల కలాపాన్ని శిష్యులైన డాక్టర్ రమాదేవి, మనస్విని అవ్వారికి నేర్పించారు. వీరు 2012లో రవీంద్ర భారతీ వేదికపై గొల్ల కలాపాన్ని ప్రదర్శించి రికార్డు సాధించారు. 12 ఏళ్ల తర్వాత వీరిద్దరూ మళ్లీ తెలుగు వర్సిటీలో నర్తించారు. ప్రవాస భారతీయురాలైన మనస్విని అవ్వారికి గ్రాండ్ ఫాదర్, గ్రాండ్ మదర్ తంగిరాల రాజ్యలక్ష్మి, తంగిరాల కోటేశ్వరరావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి గొల్ల కలాపం ప్రదర్శనను ప్రారంభించారు. పద్మశ్రీ డాక్టర్ పద్మజారెడ్డి, తెలుగు వర్సిటీ విశ్రాంత నృత్య గురువు డాక్టర్ భాగవతుల సేతూరామ్, పద్మశ్రీ డాక్టర్ శోభారాజు, తెలుగు వర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ డ్యాన్స్ హెడ్ డాక్టర్ వనజా ఉదయ్ అతిథులుగా హాజరై కళాకారులను అభినందించారు.

గురుకులాల విద్యార్థులకు పౌష్టికాహారం



షేక్‌పేట్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులతో సత్యనారాయణ తదితరులు

గోల్కొండ: గురుకులాల విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కామన్ డైట్ మెనూను అమల్లోకి తెచ్చిందని షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఆయన షేక్‌పేట్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రిన్సిపాల్ ఎస్.బాలస్వామితో కలిసి కిచెన్‌ను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మెనూలో ఉన్న వంటకాలను విద్యార్థులకు తప్పనిసరిగా అందించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తాచాటేందుకు కొత్త మెనూ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఆయన ప్రిన్సిపాల్, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

పగిలిన మంజీరా పైప్‌లైన్

మణికొండ: మంజీరా, సింగూరు రిజర్వాయర్ నుంచి మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలకు తాగునీటిని సరఫరా చేసే పైప్‌లైన్ పెద్దాపూర్ గ్రామం వద్ద ఆదివారం మధ్యాహ్నం పగిలిపోయింది. దీంతో నీటి సరఫరాను నిలిపివేసి మరమ్మతులు మొదలు పెట్టారు. సోమవారం రాత్రి వరకు నీటి సరఫరా ఉండదని ప్రజలు గమనించి నీటిని పొదుపుగా వాడుకోవాలని జలమండలి అధికారులు కోరారు.

సమస్యల వలయంలో అంగన్‌వాడీ సెంటర్లు

జియాగూడ: జియాగూడలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలోని 27 అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు నెలకొన్నాయి. ముఖ్యంగా 25 కేంద్రాలు బస్తీల్లోని అద్దె గదులలో కొనసాగుతుండగా 10 నెలల నుంచి అద్దెలను చెల్లించకపోవడంతో ఇంటి యజమానులు ఖాళీ చేయమంటున్నారు. అలాగే టీచర్లకు కూడా జీతాలు సకాలంలో ఇవ్వడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక సెంటర్‌కు వచ్చే పిల్లలకు వంట చేసేందుకు గ్యాస్ డబ్బులను 6 నెలల నుంచి ఇవ్వడం లేదు. ఇచ్చే వంట సరుకులు కూడా అంతంత మాత్రంగానే బియ్యం ఇస్తున్నారు.. ఇందులోనూ తెల్లపురుగులు వస్తున్నాయని సెంటర్ టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ఇచ్చే డబ్బులు తక్కువగా వస్తుండడంతో పిల్లలకు అన్ని అంతంత మాత్రమే లభిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోకపోతే అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడతాయని సెంటర్ టీచర్లు పేర్కొన్నారు.

బూత్ కమిటీల ఎన్నిక

చాంద్రాయణగుట్ట: జంగమ్మెట్ డివిజన్ రవీందర్ నాయక్‌నగర్‌లో బీజేపీ బూత్ కమిటీ అధ్యక్ష ఎన్నికలు నిర్వహించారు. 225, 228, 229 బూత్ కమిటీలకు ఎస్.రమేశ్ నాయక్, ఆర్.రాకేశ్ నాయక్, ఎస్. పవన్‌కుమార్ ఎన్నికయ్యారు. పార్టీ ఎస్టీ సెల్ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు గోపి నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కామాటి మహేశ్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు.

సన్మానం



గోల్కొండ: ఆధ్యాత్మిక కార్యక్రమాలు మానసిక ప్రశాంతతను చేకూర్చుతాయని రాష్ట్ర హైకోర్టు విశ్రాంత రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాధర్ భట్ అన్నారు. ఆదివారం షేక్‌పేట్‌లో శ్రీమత్ భగవత్ గీత ప్రచార సమితి ఆధ్వర్యంలో 501 సభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా గీతా ప్రచార సమితి షేక్‌పేట్ అధ్యక్షుడు ఎస్.లింగం నటేశ్వర్‌ను ఘనంగా సన్మానించారు. షేక్‌పేట్ గుట్ట పోచమ్మ ఆలయంలో జరిగిన కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు రాధాకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ధనుర్మాస పూజలు ప్రారంభం



వ్రతంలో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: ఉప్పర్‌పల్లి చైతన్య విల్లాస్ కాలనీలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఈ నెల 16 తేదీ నుంచి ధనుర్మాస పూజలు ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. వచ్చే జనవరి 14వ తేదీ వరకు పూజలు కొనసాగుతాయన్నారు. అలాగే పూజారి ముడుంబా శ్రీనివాసాచార్యుల నేతృత్వంలో వ్రతం నిర్వహించారు.

నార్సింగి మున్సిపాలిటీలో..

మణికొండ: ఈనెల 16 నుంచి ధనుర్మాసం ఉత్సవాలు ప్రారంభమవుతాయని నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవుల శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ అర్చకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 30 రోజుల పాటు ఉదయం 5.30 గంటలకు తిరుప్పావై, అర్చనలు, హారతులు ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం దర్శనం, ప్రసాద వితరణ ఉంటుందన్నారు. జనవరి 14న వేణుగోపాల ఆలయంలో గోదాదేవి కల్యాణంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.



శ్రీ సీతారామచంద్రస్వామి

సొంత ఖర్చుతో రోడ్డు నిర్మాణం

- రూ.20 లక్షలతో 60 ఫీట్ల రహదారి పనులు
- దాతృత్వం చాటుకున్న వెంకటేశ్వర కాలనీ అధ్యక్షుడు
- రెండు కాలనీల ప్రజలకు ఉపయోగం



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఉపేంద్రనాథ్‌రెడ్డి

మణికొండ: వెంకటేశ్వర కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకుడు బీ ఉపేంద్రనాథ్‌రెడ్డి సొంతంగా రూ. 20 లక్షలతో 60 అడుగుల రోడ్డుతో పాటు డివైడర్ నిర్మించి దాతృత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మణికొండ మున్సిపాలిటీ, ఏడో వార్డు పరిధిలోని వెంకటేశ్వకాలనీ, డాక్టర్ వైఎస్ఆర్ కాలనీలను అనుసంధానం చేసేలా లే అవుట్‌లో 60 అడుగుల వెడల్పుతో రోడ్డు ఉంది. దాన్ని అభివృద్ధి చేస్తే రెండు కాలనీలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలుమార్లు కాలనీవాసులు ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అయినా వారు పట్టించుకోకపోవడంతో ఆయన స్పందించి రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. శనివారం రాత్రి సదరు రోడ్డును పూర్తిగా చదును చేయించి బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసి అంతేగాకుండా మధ్యలో డివైడర్‌ను సుందరంగా తీర్చిదిద్దారు. దాంతో రెండు కాలనీల ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

కబ్జాలు చేస్తున్నారనే..

వెంకటేశ్వర కాలనీలోని పార్కులు, ఖాళీ స్థలాలు, రోడ్లను కొందరు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని ఉపేంద్రనాథ్‌రెడ్డి మండిపడ్డారు. వారికి అండగా నిలుస్తున్న ప్రజాప్రతినిధులు కొందరు వాటిని అభివృద్ధి చేయకుండా మిన్నకుంటున్నారని మండిపడ్డారు. ఇటీవలే హైటెన్షన్ వైర్ల కింద నుంచి లేఅవుట్‌లో ఉన్న 100 అడుగుల రోడ్డును ఏకంగా ఓ ఫంక్షన్‌హాల్ నిర్వాహకుడు కబ్జా చేసి 30 అడుగులకు కుదించాడన్నారు. ప్రస్తుత రోడ్డుకు అలాంటి పరిస్థితి రావద్దనే ఉద్దేశంతోనే ముందుగానే అభివృద్ధి చేశానని ఆయన తెలిపారు.

ఉచిత వైద్యశిబిరాలకు అనూహ్య స్పందన



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

మైలార్‌దేవ్‌పల్లి: ఆపద్బాంధవ సేవా సమితి ఆధ్వర్యంలో కాటేదాన్‌లోని జయదేవ్ ఆసుపత్రిలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. ఈ సందర్భంగా జనరల్ ఫిజిషియన్ సంతోష్‌కుమార్, కార్డియాలజిస్ట్ ఆరీఫ్, ఆర్థోపెడిక్ అబ్దుల్ జీహాన్, గైనకాలజిస్ట్ వెన్నల, నర్సులు వైద్య పరీక్షలు చేసి అవసరమున్న వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షుడు కే రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజలు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకుంటూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమితి జాయింట్ సెక్రటరీ బాలీరం, ప్రజలు పాల్గొన్నారు.

డిలైట్ ఆసుపత్రి ఆధ్వర్యంలో..

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనరసింహస్వామి నగర్ కాలనీలో డిలైట్ ఆసుపత్రి వారు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు, లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ధర్మకర్త సదాపటేల్ మాట్లాడుతూ కాలనీవాసులు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఆలయం, కాలనీ తరఫున ఉచిత శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యులు, ప్రజలు పాల్గొన్నారు.



శిబిరాన్ని పరిశీలిస్తున్న సదాపటేల్

వల్లభాయ్ పటేల్ సేవలు మరవలేనివి



నివాళులర్పిస్తున్న నిర్మల్‌కుమార్ యాదవ్

గన్‌ఫౌండ్రీ: భారత మాజీ తొలి హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గాంధీభవన్‌లో ఆదివారం ఏఐసీసీ ఓబీసీ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్, ఇతర కాంగ్రెస్ నాయకులు ఇఫ్తేకార్, రమణారెడ్డి, శ్యామ్ రావ్, రణధీర్ సింగ్, మల్లేష్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. నిజాంలను కూకటి వేళ్లతో అంతమొందించిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు.

యాకుత్‌పురా: సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా ఆదివారం తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి నగరంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళుల్పరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వల్లభాయ్ పటేల్ న్యాయవాదిగా, హోంమంత్రిగా దేశ సమైక్యత అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు.

'ఎక్సైజ్ శాఖ మంత్రిగా జూపల్లిని తొలగించాలి'



మాట్లాడుతున్న విక్రం గౌడ్

గన్‌ఫౌండ్రీ: కల్లుగీత వృత్తిపై జులుం ప్రదర్శిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావును ఎక్సైజ్ శాఖ నుంచి తప్పించాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రం గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం బషీర్‌బాగ్ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా కొంత కాలంగా కల్లు దుకాణాలపై ఎక్సైజ్ అధికారులు, నార్కోటిక్, పోలీస్ అధికారులు అక్రమంగా దాడులు చేస్తున్నారని మంత్రి ఆదేశాలతోనే ఈ దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో గౌడ కులస్తులకు 25 శాతం వైన్స్, బార్‌లలో అవకాశాలు కల్పిస్తామని హామీనిచ్చారని, కానీ నేడు కల్లుగీత కార్మికులను అణచివేసే ధోరణిని అవలంబిస్తున్నారని ధ్వజమెత్తారు. తక్షణమే ఎక్సైజ్ శాఖ మంత్రిని తొలగించాలని ఈ విషయంలో టీపీసీసీ అధ్యక్షుడు జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీసీ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఈడిగ శ్రీనివాస్, బీసీ విద్యార్థి సంఘం ప్రశాన కార్యదర్శి ఇంద్రం రజక, గూడూరు భాస్కర్, కార్తీక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.